క్లుప్తంగా

హైకోర్టు తీర్పుపై ముదిరాజ్‌ల హర్షం



లింగంపేట(ఎల్లారెడ్డి) : హైకోర్టు బెస్త సొసైటీల్లో ముదిరాజ్‌లకు నూతనంగా సభ్యత్వం కల్పించాలని ఇటీవల తీర్పు ఇచ్చినట్లు ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బట్టు విఠల్ తెలిపారు. ఆదివారం ఆయన లింగంపేట మండలం అయ్యపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోర్టు తీర్పు వల్ల గంగపుత్రులకు, ముదిరాజ్‌లకు మధ్య ఉన్న ప్రతిష్టంబన తొలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజు, మండల అధ్యక్షుడు సాయికుమార్, రాజులు, స్వామి, దేవేందర్, సిద్దయ్య, సంద బాలయ్య, రాజారాం బాలయ్య, బొల్లారం సాయాలు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను సక్సెస్ చేయాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఈనెల 30న అల్లాదుర్గంలో జరిగే మోదీ సభను బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేటలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మాండ్లు, శ్రీనివాస్ తదితరులున్నారు.

బజరంగ్‌దళ్ గ్రామ కమిటీ



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లిలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు. గ్రామ కమిటి అధ్యక్షుడిగా నీల సిద్దిరాములు, కార్యదర్శిగా సందీప్, గోసంరక్షక్ చిరంజీవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు వినోద్, నవీన్, తులిసి తదితరులున్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం



బిచ్కుంద(జుక్కల్) : అంబేడ్కర్ అడుగుజాడల్లో ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం గుండెనెమ్లి అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, నాయకులు నాల్చర్ రాజు, సాయిగొండ, సంగీత, యాదవ రావు, లాలయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. ఈ సందర్భంగా లింగంపేట, కోమట్‌పల్లి, జల్దిపల్లి, భవానిపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ దత్తురాం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉదయ్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని దేమికలాన కన్‌కల్, కరడ్‌పల్లి సంతాయిపేట్, చిట్యాల తదితర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి గాలి అనికుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, నాయకుల తదితరులున్నారు.

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత..

- చెరువులు, కుంటలను వదలని మొరం వ్యాపారులు
- పట్టపగలే ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- రెవెన్యూ, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా దందా



కన్నాపూర్‌లో పొక్లెయిన్‌తో మొరం తవ్వుతున్న దృశ్యం

బీబీపేట : మండల కేంద్రంలో మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. యథేచ్ఛగా మండల శివారులోని చెరువులు, కుంటల నుంచి మొరాన్ని తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ పోలీసు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మండలానికి దగ్గరలోని చెరువులు, కుంటల నుండి మొరాన్ని జేసీబీల ద్వారా తరలించడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. భవంతుల నిర్మాణాల్లో భాగంగా పునాది నింపేందుకు ఒక్కో భవంతికి 100 నుండి 200 ట్రాక్టర్ల వరకు మట్టి సరఫరా చేసేందుకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు మాట్లాడుకొని మొరం దొంగలు గ్రామాల్లో ఆనుకొని ఉన్న చెరువులు, కుంటలు నుండి మొరాన్ని సరఫరా చేస్తున్నారు. ఇందులో అధికారులకు మట్టి దొంగలు వాటాను ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వాల్టా చట్టం పూర్తిగా అక్రమార్కులకు చుట్టంలా మారిపోతోంది. అక్రమార్కులు రెవెన్యూ, పోలీసులకు ఎంతో కొంత ముడుపులు అప్పజెప్పి కట్టిపడేస్తున్నారు. కేవలం మట్టిని సరఫరా చేసేందుకే కొందరు జేసీబీలు, ట్రాక్టర్లు కొన్నారంటే ఏ రేంజిలో మట్టి సరఫరా అవుతుందో అని పలువురు విమర్శిస్తున్నారు. ఒకరోజు జేసీబీ మట్టి తవ్వకాలు చేపడితే సుమారుగా 200 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టిని తీస్తున్నారు. ఇలా చేపట్టడం వల్ల చెరువుల్లో ఉన్న గోతులు సుమారు 4 మీటర్ల లోతులో ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో గుంతల్లో నీళ్ల నిండిన తర్వాత వాటి లోతు తెలియక అమాయకులు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మొరం అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులకు తెగబడుతున్నారని రైతులు వాపోతున్నారు.

బీబీపేటలో..

బీబీపేట మండల కేంద్రంలోని కొచ్చెరువు, కుంటలతో పాటు జనగామ గ్రామానికి దగ్గరలో ఉన్నటువంటి కుంట, యడారంలోని చెరువు, కుంటలు, ఉప్పర్‌పల్లిలోని చెరువులు, కుంటలు, కోనాపూర్ తదితర గ్రామాల్లో యథేచ్ఛగా నడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మొరం దందా జరుతున్నప్పుడు స్థానిక ప్రజలు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఒకవేళ ఎవరైన వ్యక్తులు ఫిర్యాదు చేస్తే వెంటనే వారి పేర్లు మొరం దందా వ్యక్తులకు చెప్పి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

అనుమతుల్లేకుండా తవ్వకాలు..



పెద్దకొడప్‌గల్‌లో మొరం తవ్వుతున్న యంత్రాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలో బేగంపూర్ చెరువులో అనుమతి లేకుండానే మొరం తవ్వకాలు చేపడుతున్నారు. చెరువులో ఇష్టమొచ్చినట్లుగా గుంతలు తీస్తూ మొరం అమ్ముకుంటున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా మొరం విక్రయిస్తున్నారు. గ్రానైట్, కంకర క్వారీల మాదిరిగానే మొరం తవ్వకాలకు భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అలాంటి పరిస్థితి ఎక్కడా లేదు. ఒక్కో క్యూబిక్ మీటర్ మట్టికి 30 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూములైనా పట్టా భూములైనా నిబంధనలకు లోబడే అనుమతులు పొందాలి. కాని ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిద్రావస్థలో ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



మొరం దందాపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఒకవేళ అలాంటిది వస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా మట్టి తీయాలంటే ఖచ్చితంగా అనుమతు లు తీసుకోవాలి. లేకుంటే చర్యలు తప్పవు. రాత్రి సమయంలో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఒకవేళ అలాంటిది జరిగితే ఎవరినీ వదిలే ది లేదు. అనుమతులు తీసుకొని మట్టిని తీసుకోవాలి.

– ప్రభాకర్, ఎస్సై, బీబీపేట

గుట్టలు మాయం..

బాన్సువాడ : ఇల్లు కట్టాలా.. వెంచర్ వేయాలా.. ఊరి శివారులో గుట్ట మాయం కావాల్సిందే.. బాన్సువాడ ప్రాంతంలో జరుగుతున్నది ఇదే.. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ వంటి ప్రాంతాల్లో నిర్మాణరంగం జోరుగా సాగుతోంది. ఇది అక్రమార్కులకు వరంగా మారుతోంది. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మొరం తవ్వకాలు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లు, తహసీల్ కార్యాలయాల ముందు నుంచే అక్రమ దందా యాథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఆదివారం బీర్కూర్ మండలం దామరంచ తిమ్మయ్య కుంట నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లలో మొరం తరలిస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకుని టిప్పర్లను బీర్కూర్ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై బీర్కూర్ తహసీల్దార్‌ను వివరణ కోరగా ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.



కొల్లూర్ శివారులో మొరం తవ్వకాలు

జహీరాబాద్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే..



ఎల్లారెడ్డి రూరల్ : జహీరాబాద్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండా అని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, మాల్తుమ్మెద, వదల్పర్తి, గోలిలింగాల తదితర గ్రామాలలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

కమిటీల పేరుతో మాదిగలకు మోసం



బిచ్కుంద(జుక్కల్) : పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ వేసి వర్గీకరణ కోసం చట్టం తెస్తానని పీఎం మోదీ మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని దళిత కాంగ్రెస్ నాయకుడు తుకారాం అన్నారు. ఆదివారం మండలంలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ ఆదివారం పిట్లంలో బీజేపీకి ఓటు వేయాలనడం బాధాకరమన్నారు.

బస్సులో సీటు గగనమే..



బాన్సువాడ రూరల్ : నాలుగైదు రోజులుగా ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో నిలబడేందుకు కూడా స్థలం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పెళ్లిలు, ఇతర శుభకార్యాలు ఉన్నందున బస్సుల్లో రద్దీ పెరిగింది. బాన్సువాడ నుంచి కామారెడ్డి, బోధన్, ఎల్లారెడ్డి, మద్నూర్ రూట్లలో ప్రయాణికులు ఎక్కువగా ఉంటున్నారు. అదనపు సర్వీసులు అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జహీరాబాద్‌ను కాంగ్రెస్ ఖాతాలో వేయాలి



షబ్బీర్, సురేశ్ షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు





ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమక్షంలో..

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు. బీజేపీ నాయకులు డాక్టర్ సిద్దిరాములు, పట్టణానికి చెందిన వైద్యుడు పుట్ట మల్లికార్జున్ షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆర్‌పీఐ నుంచి ఆరిఫ్ కాంగ్రెస్‌లో చేరారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని మాజీ ఉప సర్పంచులు మాచాపూర్, దావల్ మల్కపల్లి, వెంకటాపూర్ గ్రామాల మాజీ ఉప సర్పంచులు జహంగీర్, పరంధాములు, శివప్రసాద్, పలువురు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బిచ్కుంద(జుక్కల్) : మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు, గుండెనెమ్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీ సిద్దిరాములు పటేల్ తదితరులు ఆదివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

దోమకొండ : మండలానికి చెందిన సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రాజంపేట : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు ఇట్టం పెద్ద సిద్దరాములు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : సోమారం గ్రామానికి చెందిన సోమారం మాజీ సర్పంచ్ చరన్‌రెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎల్లారెడ్డి : మండలంలోని భిక్కనూరులో మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో మాజీ సర్పంచులు పోచయ్య, బన్నిసక్క తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

సంక్షిప్తం

వెల్లుట్లవాసికి ఎల్‌ఓసీ అందజేత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన పడేకుల నర్సింలుకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం రూ. 1.60 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. నర్సింలు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఆస్పత్రిలో చేరగా అతడికి ఆపరేషన్ నిమిత్తం డబ్బులు అవసరముండడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చెక్కు అందజేశారు.

బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ



దోమకొండ : బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోయే నావలాంటిదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీని వీడిన సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అండెం శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రావులపల్లి నర్సారెడ్డి మాట్లాడారు. పదేళ్లలో కేసీఆర్ దొరల పాలన చేశాడన్నారు. జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు తదితరులున్నారు.

పదవి విరమణ పొందిన ఎస్సైకి సన్మానం



కామారెడ్డి టౌన్ : పోలీస్ శాఖలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఎస్సై రాములును ఆదివారం అశోక్‌నగర్ కాలనీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జూకంటి ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



బాన్సువాడ : వచ్చే నెల 1న నిర్వహించే మేడేను సక్సెస్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక చట్టాలను తుంగలో తొక్కారన్నారు. సమావేశంలో కార్మికులు బుజ్జిగారి సాయిలు, మేకల రాజు తదితరులున్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

రామారెడ్డి : జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలించాలని ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య ఆధ్వర్యంలో ఆదివారం సదాశివనగర్‌లో కాంగ్రెస్ ప్రచారం చేశారు.

పిట్లం(జుక్కల్): మండలంలోని కంభపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వీరశైవ లింగాయత్‌లు ఆదివారం ప్రచారం నిర్వహించారు. జిల్లా వీరశైవ లింగాయత్ కార్యదర్శి మల్లప్ప పటేల్, లింగాయత్ నాయకులు హన్మాండ్లు పటేల్ పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు చందాపూర్, సంగోజీవాడి, సంతాయిపేట్, ఎండ్రియాల్, కృష్ణాజివాడి, కరడ్‌పల్లి గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు మహేందర్‌రెడ్డి, శ్యాంరావు, సంజీవరెడ్డి, మేకలరాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బానాపూర్, బాణాపూర్ తండా, ఎక్కపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, రాములు, నర్సింలు, సంజీవ్, అశోక్, సత్యం తదితరులున్నారు.

అలరించిన కుస్తీ పోటీలు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని మల్లూర్ గ్రామంలో ఆదివారం మల్లయోధుల కుస్తీ పోటీలు ప్రేక్షకులను అలరించాయి. కొబ్బరికాయ నుంచి మొదలైన కుస్తీ పోటీల రూ. 2 వేల వరకు జరిగాయి. చుట్టు పక్కల మండలాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలి వచ్చారు. విజేతలకు నగదు బహుమానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కుస్తీ పోటీల నిర్వాహకులు శ్రీనివాస్, పెద్ది హన్మాండ్లు, పెద్ది అంజయ్య తదితరులున్నారు.

రోడ్డుపై పొగతో ఇక్కట్లు



మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డుకు ఇరుపక్కల వరి పొలాలకు నిప్పుపెట్టడంతో పొగ కమ్ముకుని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ఆజాద్

కామారెడ్డి టౌన్ : ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేజీ నుంచే రూ. లక్షల్లో ఫీజులను దండుకుంటున్న ప్రభుత్వం పట్టించుకోకుండా వత్తాసు పలుకుతుందని విమర్శించారు. కామారెడ్డిలో విద్యాహబ్‌తో విద్యాసంస్థలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, నాయకులు సరిచంద్ తదితరులున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితోనే ప్రభుత్వం పనిచేస్తుంది



మద్నూర్(జుక్కల్) : రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని చిన్న ఎక్లార, అవాల్‌గావ్‌లో ఆదివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజలు ఓటు రూపంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా కన్‌కల్-కరడ్‌పల్లి రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కన్‌కల్-కరడ్‌పల్లి అధ్వానంగా తయారైన రోడ్డును బాగుచేయించాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు. కన్‌కల్ గ్రామం నుంచి కరడ్‌పల్లి వరకు ఉన్న రోడ్డులో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. కొన్నేళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రతిరోజు ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డుపై తాడ్వాయి, కరడ్‌పల్లి, కన్‌కల్, దేమికలాన్,ఎర్రాపహాడ్, లింగంపల్లి, జనగాం, జువ్వాడ తదతర గ్రామాలకు చెందిన ప్రయాణికులు వెళుతుంటారు. వెంటనే రోడ్డును బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గత రెండు రోజులుగా నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులున్నారు.

సాయిబాబా ఆలయ అష్టమ వార్షికోత్సవం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులోని సాయిబాబా అష్టమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు గంగవరం ఆంజనేయశర్మ స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం 8 గంటలకు బాబాకు సుగంధద్రవ్యాలతో, పంచామృతాలతో, గంగా జలంతో అభిషేకాలు చేశారు. 12 గంటలకు విశేష నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాల ఊరేగింపు

బీబీపేట : మండలంలోని మల్కాపూర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రేణుకా జమదగ్ని ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ అమ్మవారికి బోనాలు ఊరేగించారు. బైండ్లోళ్ల ఆట పాటలతో, డప్పుచప్పుల్ల మధ్య బోనాలను తీశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద నిత్యపూజ, గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

చండీ జన్మదిన మహోత్సవాలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి చండీ మంత్రాలయం హిర్యానంద ఆశ్రమంలో మే నెల 1,2,3 తేదిల్లో చండీ జన్మదిన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్‌లో సోమవారం బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. బీరప్ప, కామరతి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం, కల్యాణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీరప్ప ఆలయ ఉత్సవాలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రమేష్‌యాదవ్ తెలిపారు.